క్లుప్తంగా

నీట్‌లో విద్యార్థుల ప్రతిభ

వెల్దండ: మండలంలోని కేస్లీతండాకు చెందిన మేగావత్ చంద్రవంశీ నీట్ పరీక్షలో ప్రతిభ చాటాడు. మారుమూల తండాకు చెందిన ఈయన ఆల్ ఇండియాలో 1,754వ ర్యాంక్ సాధించాడు.

పెంట్లవెల్లి: నీట్ ఫలితాలలో మండల కేంద్రానికి చెందిన హర్షిత 481 మార్కులు సాధించింది. ప్రతిభ కనబర్చడంతో తల్లిదండ్రులు, స్థానికులు శుభాకాంక్షలు తెలియజేసి హర్షం వ్యక్తం చేశారు.

టాపర్స్‌కు నగదు పురస్కారం

లింగాల: పదో తరగతి పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన మండలంలోని అంబట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులకు క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో నగదు పురస్కారంతో పాటు మెడల్స్ అందజేశారు. క్లబ్ వ్యవస్థాపకుడు వాస రాఘవేందర్, డివిజన్ అధ్యక్షుడు కొత్త రామకృష్ణ ఒక్కో విద్యార్థికి రూ.1,116 అందజేశారు. ప్రిన్సిపాల్ వినోద్‌ఖన్నా, తాహెర్‌పాష, శ్రీనివాసులు, శివ, ఎస్‌ఓ శారదను సన్మానించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

వెల్దండ: మండలంలోని కంటోనిపల్లికి చెందిన శ్రీరాములుకు ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో సీఎంఆర్‌ఎఫ్ పథకం ద్వారా మంజూరైన రూ.47వేలు చెక్కును బుధవారం సింగల్‌విండో డైరెక్టర్ సంజీవ్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రామకృష్ణ, రాజశేఖర్, నారాయణ తదితరులు ఉన్నారు.

పుస్తకాలు, పలకలు..

కొల్లాపూర్ రూరల్: మండలంలోని అమరగిరి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వనిత గోల్డ్ క్లబ్ ఆధ్వర్యంలో పుస్తకాలు, పెన్నులు, పలకలు, బలపాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు శ్రీదేవి, హరిక, ఉపసర్పంచ్ మల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

తాడూరు: ఓటరు నమోదుపై ఆయా గ్రామాల బీఎల్‌ఓలకు ఆర్‌ఐ గోపాలకృష్ణ అవగాహన కల్పించారు. బుధవారం రెవెన్యూ కార్యాలయ ఆవరణలో ఫాం-7 లో రెండు ఓట్లు కలిగిన వారిని గుర్తించి తొలగింపు, ఫాం-6లో కొత్త ఓటు కోసం నమోదుపై వివరించారు.

పీజీ కళాశాలలో పాటల పోటీలు

కొల్లాపూర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాలలో విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. సామాజిక, జానపద, తెలంగాణ ఉద్యమానికి సంబంధించిన పాటలను విద్యార్థులు పాడారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మార్క్ పోలోనియస్, అధ్యాపకులు రమణ, పుట్ట శ్రీనివాసులు, శిరీష, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

దోమలపెంటలో ఆర్టీసీ కార్గో కేంద్రం



దోమలపెంట: దోమలపెంటలో టీఎస్ ఆర్టీసీ (కార్గో) పార్సిల్, కొరియర్ సర్వీస్‌ను డీఆర్ ఎంఈ శివకుమార్, డీఎం ఎగ్జిక్యూటివ్ రాజ్‌కుమార్, డీఎంఈ చెన్నయ్య బుధవారం ప్రారంభించారు. గ్రామస్తులకు ఇక్కడి నుంచి రెండు తెలుగు రాష్ట్రాలలో ఎక్కడికైనా పార్సిల్ పంపే అవకాశం, ఇతర ప్రాంతాల నుంచి దోమలపెంటకు తెప్పించుకునే సేవలు ఆర్టీసీ కల్పించిందని తెలిపారు.

బీసీలందరికీ సాయం అందించాలి

కల్వకుర్తిరూరల్: ఆర్థికంగా వెనకబడిన బీసీ కులాలందరికీ రూ. లక్ష సాయం అందించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద దరకాస్తు చేసుకున్న వారితో నాయకులు మాట్లాడారు. విద్యార్థులకు, దరకాస్తుదారులకు సరైన సమయంలో ధ్రువీకరణ పత్రాలు రావడం లేదన్నారు. సమస్యను దృష్టిలో పెట్టుకుని గడువుతేదీని పెంచాలని డిమాండ్ చేశారు. పట్టణ అధ్యక్షుడు నర్సింహ, రవిగౌడ్, వివేకానంద శివ, నవీన్ పాల్గొన్నారు.

వంద పడకల ఆస్పత్రిలో వసతులేవీ?

అచ్చంపేట రూరల్: పట్టణంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు వంద పడకల ఆస్పత్రిని ప్రారంభించినా ఎలాంటి వసతులు లేవని బీజేపీ నాయకుడు సతీష్ ఆరోపించారు. బుధవారం పట్టణంలోని ఆస్పత్రిని బీజేపీ నాయకులు పరిశీలించారు. అరకొర సిబ్బందితో రోగులకు ఎలాంటి వైద్య సేవలు అందడం లేదని ఆరోపించారు. మధ్యాహ్నం ఉప్పునుంతల మండలం కొరటికల్ చెందిన ఆటో డ్రైవర్ రాజు(30) ఫిడ్స్ వచ్చి చేరగా మృతి చెందాడన్నారు. 30 పడకల ఆస్పత్రి వసతులే ఉన్నాయని, 100 పడకల ఆస్పత్రిలో అదనంగా ఎలాంటి సదుపాయాలు లేవని ఆరోపించారు.

వైద్యరంగంలో అద్భుత సంస్కరణలు


వైద్యారోగ్య శాఖ అధికారులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తి టౌన్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక వైద్యరంగంలో అద్భుత సంస్కరణలు వచ్చాయని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాలులో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన వైద్య ఆరోగ్య దినోత్సవం కార్యక్రమంలో ఆర్డీఓ రాజేష్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోనే సాధారణ కాన్పులలో కల్వకుర్తి సీహెచ్‌ఎసీ ప్రథమ స్థానంలో నిలవటం వైద్యరంగంలో మార్పులకు నిదర్శనమన్నారు. ఇంతకు ముందు ప్రభుత్వ ఆస్పత్రులంటే ప్రజలు భయపడేవారని, ప్రస్తుతం పరిస్థితి చాలా మారిందని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రి వచ్చే వారికి సకల సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. కేసీఆర్ కిట్ పథకాలను ప్రవేశపెట్టడంతో పాటుగా, సాధారణ కాన్పులను ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా గర్భిణులకు న్యూట్రీషియన్ కిట్లను అందజేసి వారి ఆరోగ్యాన్ని మరింతగా కాపాడేందుకు ప్రభుత్వం దోహదం చేస్తుందన్నారు. కల్వకుర్తి సీహెచ్‌సీలో సాధారణ కాన్పులను అధికంగా చేసి, రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చిన గైనకాలజిస్టు విజయ్ కుమార్‌ను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన వైద్యులతో పాటుగా సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేశారు. అలాగే గర్భిణులకు న్యూట్రీషియన్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్యం, ఎంపీపీ మనోహర, డీసీహెచ్‌ఎస్ రమేష్ చంద్ర, తహసీల్దార్ రాంరెడ్డి పాల్గొన్నారు.

దైవభక్తిని పెంపొందించుకోవాలి

వెల్దండ: ప్రతి ఒక్కరూ దైవ భక్తిని పెంపొందించుకోవడంతో మనస్సు ప్రశాంతంగా ఉంటుందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బీరప్ప దేవాల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

అచ్చంపేట రూరల్: రాష్ట్రంలోని నిరుపేద కుటుంబాలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నామని, సీఎం కేసీఆర్ ప్రజా ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తున్నారని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. బుధవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాలులో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వైద్య, ఆరోగ్యశాఖ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో త్వరలోనే కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ప్రారంభిస్తామన్నారు. ఈ విషయంపై వైద్య విధాన పరిషత్ కమిషనర్‌తో మాట్లాడగా హామీ ఇచ్చారని తెలిపారు. ఆస్పత్రుల్లో విధులు నిర్వర్తిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బందిని ఇబ్బందులకు గురి చేయడం సరైంది కాదన్నారు. పట్టణంలో వంద పడకల ఆస్పత్రిని ప్రారంభించుకోవడం ఎంతో అదృష్టమన్నారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ఆస్పత్రిలో మొదటి సారి కొల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన ఓ పేద కుటుంబానికి చెందిన వ్యక్తి డయాలసిస్ చేయించుకోవడం ఇందుకు నిదర్శనమన్నారు. నర్సింగ్ కళాశాలతో పాటు పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. గర్భిణులకు న్యూట్రీషన్ కిట్లు అందజేశారు. ఉత్తమ వైద్య సేవలు అందించిన పలువురు సిబ్బందికి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అరుణ, మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, ఎంపీపీ శాంతాబాయి, వైద్యులు తారాసింగ్, కృష్ణ, ప్రభు, రాజేష్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


ఫార్మాసిస్టుకు జ్ఞాపికను అందిస్తున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

జీఓను వెంటనే పునరుద్ధరించాలి


తెలకపల్లిలో వివరాలు తెలుసుకుంటున్న సీఐటీయూ నాయకులు

తెలకపల్లి: పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో నాయకులు ఇంటింటి సర్వే నిర్వహించారు. మండల కేంద్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఒకే కుటుంబంలో ఎక్కువ మంది చిన్న చిన్న ఇళ్లలో నివసిస్తున్నారని వారు పేర్కొన్నారు. వివాహమైన కుటుంబాలు ఎక్కడ ఉండాలో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. నియోజవర్గ కేంద్రాలలో కొన్ని గ్రామాలలో డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించినా పంపిణీ చేయలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇళ్ల పేరుతో స్థలాల పంపిణీ జీఓను రద్దు చేసిందని దానిని వెంటనే పునరుద్ధరించాలన్నారు. ప్రభుత్వం కొన్ని గ్రామాలలో ఇళ్ల పట్టాలు ఇచ్చి మళ్లీ తీసుకుందన్నారు. జిల్లాలో వందల ఎకరాల భూమి ప్రభుత్వ ఆధీనంలో ఉందని ఆ భూముల్లో నిరుపేదలకు ఇళ్ల స్థలాల నిర్మాణం కోసం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భాస్కర్, విజయ్‌గౌడ్, జగదీశ్వర్, రమేష్ ఆంజనేయులు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలి

కల్వకుర్తిరూరల్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ విస్తృత సమావేశం నిర్వహించారు. సీనియారిటీ ప్రకారం కార్మికులను పర్మనెంట్ చేయాలన్నారు. ఈ సందర్భంగా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా పెద్దులు, ఉపాధ్యక్షులుగా శ్రీను, చంద్రయ్య, రమేష్, గౌరవ అధ్యక్షుడిగా ఆంజనేయులుతో పాటు పలువురిని ఎంపిక చేశారు.

ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలి

చారకొండ: ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన ప్రమాణాలతో విద్య, ప్రభుత్వ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తుర్కలపల్లి యూపీఎస్ ప్రధానోపాధ్యాయుడు మహిపాల్ నాయక్ తెలిపారు. మండలంలోని తుర్కలపల్లిలో 7వతరగతి పూర్తి చేసుకున్నా 13 మంది విద్యార్థులను వారి తల్లిదండ్రులతో మట్లాడి బుధవారం మండల కేంద్రంలో ఉన్న జెడ్పీహెచ్‌ఎస్‌లో చేర్పించారు.

22న ప్రత్యేక గ్రామ సభలు

నాగర్‌కర్నూల్ రూరల్: దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈ నెల 22వ తేదీన అన్ని గ్రామాలలో ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించి అమరవీరులకు నివాళులు అర్పించాలని ఎంపీడీఓ కోటేశ్వర్‌రావు సర్పంచ్‌లకు, కార్యదర్శులకు బుధవారం ప్రకటనలో సూచించారు. ఉదయం 11 గంటలకు అన్ని పంచాయతీల వద్ద గ్రామసభలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం అమరుల సంస్మరణ తీర్మానాలు చేయాలని తెలిపారు. ఆయా పంచాయతీల్లో ఉన్న ప్రజలు, ప్రజానిధులు, ప్రభుత్వ ఉద్యోగులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

ఎంఈఓ పోస్టును భర్తీ చేయాలి

కోడేరు: మండలంలో ఎంఈఓ పోస్టును భర్తీ చేయాలని ఆయా గ్రామాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న ఇన్‌చార్జ్ ఎంఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఏసీబీకి పట్టుబడటంతో 8 నెలలు కావస్తున్నా పోస్టు ఖాళీగా ఉంది. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురుకుల, నవోదయ తదితర పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు రికార్డు షీట్ మీద ఎంఈఓ సంతకం కావాలని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు అడుగుతుండటంతో విద్యార్థులు చేసేది లేక నాగర్‌కర్నూల్ డీఈఓ కార్యాలయానికి వెళ్లి డీఈఓ సంతకం చేయించుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిసార్లు డీఈఓ దొరకడం లేదని విద్యార్థులు అంటున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి మండలానికి ఇన్‌చార్జి ఎంఈఓగా నియమించాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వైద్యుల తీరుపై 'గువ్వల' అసహనం

కల్వకుర్తి టౌన్: చారకొండ మండలం తుర్కలపల్లికి చెందిన మహిళకు ప్రసవించిన నవజాత శిశువు కుటుంబాన్ని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు బుధవారం పరామర్శించారు. పట్టణంలోని సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న మహిళ కుటుంబాన్ని బుధవారం రాత్రి ఆస్పత్రికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. మృతికి గల కారణాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లనే శిశువు మృతి చెందిందని కుటుంబసభ్యులు చెప్పగా, పూర్తి వివరాలు తెలుసుకున్న తర్వాతనే ఏదైనా మాట్లాడటానికి వీలవుతుందని ఆయన బాధిత కుటుంబసభ్యులకు సర్దిచెప్పారు. వైద్యులతో సరైన సమాధానం రాకపోవటంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

కమిషనర్‌కు ఫోన్

ఆస్పత్రిలో ఘటనపై కలెక్టర్ ఉదయ్‌కుమార్‌తో మాట్లాడిన తర్వాత డీసీహెచ్‌ఎస్ రమేష్‌చంద్రకు ఫోన్‌చేయగా అంటుబాటులోకి రాలేదు. వెంటనే తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఘటనపై సత్వరమే విచారణ నిర్వహించి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రులపై ఉన్న మక్కువ కొంతనైనా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులపైన చూయించినా వారు మిమ్మల్ని గుండెల్లో గుడి కట్టుకొని చూసుకుంటారని మందలించారు.

ఆరోగ్య తెలంగాణే సీఎం కేసీఆర్ లక్ష్యం


న్యూట్రీషియన్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్: ఆరోగ్య తెలంగాణను నిర్మించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని ఫంక్షన్‌హాల్‌లో వైద్య, ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. వైద్యశాఖ సిబ్బందికి ప్రశంసా పత్రాలు, గర్భిణులకు న్యూట్రీషియన్ కిట్లు అందించారు. ప్రభుత్వాసుపత్రి కొత్త అంబులెన్సును ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకుముందు వేడుకల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ మాతా, శిశు సంరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. కేసీఆర్ కిట్లు, న్యూట్రీషియన్ కిట్ల పంపిణీ కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. పట్టణంలో మాతా, శిశు సంరక్షణ కేంద్రం సేవలను ఆయన ప్రశంసించారు. డయాలసిస్ సెంటర్‌ను కిడ్నీ రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వంద పడకల ఆస్పత్రి పనులు పూర్తయితే ప్రజలకు ఇంకా మెరుగైన వైద్యసేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ హనుమనాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వెంకటసదాసు, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, చైర్మన్ కాటం జంబులయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్, ఎంపీపీ బోజ్యానాయక్ పాల్గొన్నారు.

రక్తదానం చేయడం అభినందనీయం


సర్టిఫికెట్ అందజేస్తున్న డీసీహెచ్‌ఎస్

కల్వకుర్తి టౌన్: ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి అందించే రక్తాన్ని ఇతరులు ఇవ్వటం చాలా గొప్పదని డీసీహెచ్‌ఎస్ రమేష్‌చంద్ర అన్నారు. బుధవారం పట్టణంలోని సీహెచ్‌సీ ఆవరణలో దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన వైద్య ఆరోగ్య దినోత్సవంలో భాగంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ వారికి 40 యూనిట్ల రక్తాన్ని అందించినట్లుగా తెలిపారు. రక్తదానానికి ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా ఆస్పత్రిలోని రోగులకు వైద్యారోగ్య దినోత్సవం సందర్భంగా ఆస్పత్రి సిబ్బంది పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శివరాం, వైద్యులు, సిబ్బంది, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

పల్లెప్రగతి దినోత్సవానికి ముస్తాబు


మన్ననూర్ పంచాయతీ కార్యాలయం

అమ్రాబాద్: దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం నిర్వహించే పల్లెప్రగతి దినోత్సవానికి మండలంలో ఉన్న 20 పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాట్లు చేసి ముస్తాబు చేస్తున్నారు. అదేవిధంగా పల్లెప్రగతి దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ రామ్మోహన్, ఎంపీఈఓ వెంకటయ్య, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం పల్లె ప్రగతి దినోత్సవానికి సంబంధించిన ఫ్లెక్సీలు, బ్రోచర్స్, దుస్తులు, శానిటేషన్ పరికరాలు, పచాయతీ భవనాల లైటింగ్ తదితర పరికరాలను పంచాయతీలకు అందజేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఉత్సవాలలో ప్రజలందరినీ భాగస్వాములను చేస్తూ విజయవంతం చేయాలని అధికారులు తెలిపారు. అదేవిధంగా అన్ని పంచాయతీలలో వీధుల గుండా ర్యాలీ నిర్వహించి పంచాయతీల వద్ద పతాక ఆవిష్కరణ నిర్వహించి 2019 సెప్టెంబర్ నుంచి ఇప్పటి వరకు చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు.

దేవాలయ పునర్నిర్మాణానికి భూమి పూజ



కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటం సమీపంలో ఉన్న లక్ష్మీనర్సింహస్వామి దేవాలయ పునరి్నర్మాణ పనులకు ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి బుధవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడిగిన వెంటనే ముఖ్యమంత్రి కేసీఆర్ సొంత నిధుల నుంచి రూ.15 కోట్లు మంజూరు చేశారన్నారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు దేవస్థానాల అభివృద్ధికి కృషి చేయలేదన్నారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని యంగంపల్లిలో పోచమ్మ దేవాలయ నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జంగయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రవిగౌడ్, రాంరెడ్డి, పాండుగైడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పునుంతల: మండలంలోని గట్టుకాడిపల్లిలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం గ్రామస్తులు భూమి పూజ నిర్వహించారు. గ్రామంలోని దాతల సహకారంతో ఆలయ నిర్మాణానికి త్వరలోనే పూర్తి చేయనున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అనంతరెడ్డి, జంగిరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి భీమయ్య, రామకృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం


వెల్దండలో పాలాభిషేకం చేస్తున్న రైతులు

వెల్దండ: మండల కేంద్రంలోని హైదరాబాద్-శ్రీశైలం ప్రధాన రహదారిపై సీఎం కేసీఆర్ చిత్రపటానికి బుధవారం రైతులు పాలాభిషేకం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కాల్వ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులు నష్టపరిహారం డబ్బులను ఖాతాలు జమచేసినట్లు పేర్కొన్నారు. భూములు కొల్పోయి ఏళ్లు గడుస్తున్న నష్టపరిహారం కోసం ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలస్యమైనప్పటికి రైతులకు న్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో రైతులు శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, కాళ్ల బాలస్వామి, దేవేందర్, శ్రీను, వెంకటయ్య, నారాయణనాయక్ తదితరులు ఉన్నారు.

ముఖ్యమంత్రి బీసీల శ్రేయోభిలాషి

కల్వకుర్తిరూరల్: ముఖ్యమంత్రి కేసీఆర్ బడుగుబలహీన వర్గాల శ్రేయోభిలాషి అని కల్వకుర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంగాధరాచారి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. బీసీలలోని వెనుకబడిన కులాలకు రూ.లక్ష ఆర్థిక సహకారం అందించే కార్యక్రమం ఎంతో మంచిదని అన్నారు. శ్రీనివాస్‌యాదవ్, లక్ష్మయ్యగౌడ్, బాలనర్సింహ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షకు డీసీసీ అధ్యక్షుడు, బీజేపీ, పలు సంఘాల నాయకులు మద్దతు పలికి మాట్లాడారు. ఉద్యమ కాలంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటం చేస్తామని ఫెడరేషన్ నాయకులు హెచ్చరించారు. అనంతరం సాయంత్రం దీక్షలో కూర్చున్న జర్నలిస్టు నాయకులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. కార్యక్రమంలో రామచంద్రం, శ్రీను, భాస్కర్, శ్రీధర్, బాలకృష్ణ, మల్లికార్జున్, శ్రీశైలం, నారాయణరావు, నాయకులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఘనంగా అక్షరాభ్యాసం


పెంట్లవెల్లిలో అక్షరాలు దిద్దిస్తున్న ఉపాధ్యాయులు

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ భాస్కర్‌రెడ్డి మేడిపూర్ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి అక్షరాభ్యాసాన్ని చేయించారు. గ్రామాలలో బడి ఈడు కలిగిన పిల్లలందరి జాబితాను పరిశీలించి ఇంటింటా తిరిగి బడిలో చేర్పించాలన్నారు.

పెంట్లవెల్లి: మండలంలోని మంచాలకట్ట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు రాజేష్, సుచరిత చిన్నారులకు పలకపై ఓనమాలు దిద్దుతూ అక్షరాభ్యాసం చేయించారు. పిల్లలను పాఠశాలకు ప్రతి రోజు పంపించాలని, ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు వారు అవగాహన కల్పించారు.

కల్వకుర్తిని ఎడారిగా మార్చే ప్రయత్నం


రెగ్యులేటర్‌ను పరిశీలిస్తున్న మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

బిజినేపల్లి: కల్వకుర్తి నియోజకవర్గానికి సాగునీరు అందించే ప్రధాన ఉద్దేశంతో నిర్మించిన కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి మంగనూర్ గ్రామ సమీపంలో కొత్తగా రెగ్యులేటర్ ఏర్పాటు చేసి మరో సారి కల్వకుర్తిని ఎడారిగా మార్చేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం సాయంత్రం మంగనూర్‌లోని కేఎల్‌ఐ కాల్వ వద్ద కొత్తగా నిర్మిస్తున్న రెగ్యులేటర్‌ను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం నుంచి ఇప్పటికే కల్వకుర్తికి సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతుంటే, కాల్వకు మధ్య రెగ్యులేటర్ ఏర్పాటు చేసి నీటిని భీమా ఆయకట్టుకు తరలించేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తద్వారా నాగర్‌కర్నూల్, కల్వకుర్తి నియోజకవర్గాల ప్రజలకు పంటలు పండక, ఉపాధి లేక, వారి బతుకుల్ని ఎడారిగా మార్చే ప్రయత్నం ప్రభుత్వం చేస్తుందన్నారు. ఈ ప్రభుత్వం నిరంకుశత్వంతో పని చేసి ప్రజలను పొట్ట కొడుతుందన్నారు. ఇలాంటి చర్యలు మానుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో రవి, పర్వతాలు, రాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రగతిపై విజయోత్సవ ర్యాలీ


విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఉప్పునుంతల: స్థానిక బాలుర ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో బుధవారం పాఠశాల విద్యా ప్రగతిపై మండలకేంద్రంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఐదేళ్లలో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఘననీయంగా పెంచడంతోపాటు చక్కటి విద్యాబోధన చేసి 27 మంది విద్యార్థులు గురుకుల పాఠశాలలకు ఎంపిక కావడాన్ని పురస్కరించుకుని ర్యాలీ చేపట్టారు. గురుకుల పాఠశాలలో సీట్లు సాధించిన విద్యార్థుల ఫ్లెక్సీలను ట్రాక్టర్‌లో ఊరేగించారు. గ్రామంలో ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చదివించాలని నినదిస్తూ వీధుల వెంట ర్యాలీ కొనసాగించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం హన్మంత్‌రెడ్డి, నాయకులు మాట్లాడుతూ.. పాఠశాలలో పనిచేస్తున్న హెచ్‌ఎం లక్ష్మీనారాయణతో పాటు ఉపాధ్యాయులు బాలమణి, వెంకటేష్ కృషితోనే విద్యాప్రగతి సాధ్యపడి ఎన్నడూ లేనివిధంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించడం సంతోషదాయకమని ఉపాధ్యాయులను అభినందించారు. బాలుర ప్రాథమిక పాఠశాలను మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, నర్సింహారెడ్డి, నాయకులు రామచంద్రయ్య, శ్రీను, తిరుమలయ్య, తిరుపతయ్య, తల్లిదండ్రులు పాల్గొన్నారు.